సాక్షి తిరుపతి

శుక్రవారం । 24 । మార్చి । 2023



అలిపిరి బస్టాండ్‌లో చార్జింగ్

తిరుపతి అలిపిరి: విద్యుత్ వాహనాలకు తిరుపతి అలిపిరి బస్టాండ్‌లో చార్జింగ్ పెట్టేందుకు వీలుగా 48 పాయింట్లు ఏర్పాటు చేశారు. టీటీడీకి చెందిన ధర్మరథాలు(విద్యుత్ బస్సులు) గురువారం ఇక్కడ రీచార్జి చేసుకున్నాయి. .



గురుదక్షిణామూర్తికి పూజలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన మేథో గురుదక్షిణామూర్తికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కలశ ప్రతిష్ట, వినాయకపూజ, కలశపూజ, పలు వైదిక కత్రువులను వైభవంగా నిర్వహించారు.



తిరుపతిలో వర్షం

తిరుపతి నగరంలో గురువారం కాసేపు వర్షం కురిసింది. ఉదయం నుంచి దోబూచులాడుతున్న మేఘాలు మధ్యాహ్నం కాసేపు వర్షించాయి. ఈ వర్షం నగర వాసులకు కాస్త చల్లదనాన్ని పంచింది. -సాక్షి, తిరుపతి

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ శుక్రవారం (సా)	సహర్ శనివారం(ఉ)
తిరుపతి	6.27	4.55
చిత్తూరు	6.29	4.54
పుంగనూరు	6.31	4.57

న్యూస్‌రీల్


ఇంటర్ పరీక్షకు 1,169 మంది గైర్హాజరు

తిరుపతి ఎడ్యుకేషన్: ఇంటర్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రథమ సంవత్సర విద్యార్థులకు మ్యాథ్స్-1బీ, జువాలజీ, హిస్టరీ సబ్జెక్టుల్లో పరీక్ష జరిగింది. ఈ పరీక్షకు ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా 141 పరీక్షా కేంద్రాల్లో జనరల్‌లో 38,398 మంది, ఒకేషనల్‌లో 4,005, మొత్తం 42,403 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా వీరిలో జనరల్‌లో 781మంది, ఒకేషనల్‌లో 388, మొత్తం 1,169 మంది గైర్హాజరైనట్లు ఆర్ఐఓ వీ.రమేష్ తెలిపారు. ఈ పరీక్షలో భాగంగా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ద్వితీయ సంవత్సర విద్యార్థులకు మ్యాథ్స్-2బీ, జువాలజీ, హిస్టరీ సబ్జెక్టుల్లో పరీక్ష జరగనుంది.

టెన్త్ విద్యార్థులకు ఉచిత ప్రయాణ సౌకర్యం

తిరుపతి అర్బన్: ఏప్రిల్ 3 నుంచి 18వ తేదీ వరకు పదో తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేసే సౌకర్యాన్ని కల్పిచామని జిల్లా ప్రజారవాణ అధికారి చెంగల్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అయితే విద్యార్థులు కండక్టర్‌కు హాల్ టిక్కెట్ చూపించాల్సి ఉందని పేర్కొన్నారు. విద్యార్థులకు సాధారణ పాస్ ఉన్నా లేకున్నా ఉచితంగా ప్రయాణం చేయడానికి ప్రభుత్వం వీలుకల్పించిందని తెలిపారు.

క్షయ.. భయమొద్దయా!



ఒకప్పుడు క్షయ అంటే హడలిపోయేవారు. వ్యాధిబారిన పడిన రోగిని చూస్తే అల్లంత దూరానికి వెళ్లేవారు. కానీ ఇప్పుడు పరిస్థితి మారింది. వ్యాధిగ్రస్తులు ఎంచక్కా దగ్గర్లోని ఆరోగ్యకేంద్రానికిగానీ, డీఎంసీకిగానీ వెళ్లి పరీక్షలు చేయించుకుంటున్నారు. తొలి దశలోనే ప్రభుత్వం అందిస్తున్న మందులు, మాత్రలు వాడుతూ వ్యాధిని నయం చేసుకుంటున్నారు. కోవిడ్ నిబంధనలతో ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో క్షయ కేసులు భారీగా తగ్గుతున్నట్టు అధికారులు చెబుతున్నారు. నేడు ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా క్షయ వ్యాధి లక్షలు.. నివారణ తదితర అంశాలపై సాక్షి ప్రత్యేక కథనం.

- సకాలంలో గుర్తిస్తే నివారణ సాధ్యమే
- సరైన సమయంలో పరీక్షలు చేయించుకోవాలి
- క్షయ బాధితుల అండగా రాష్ట్ర ప్రభుత్వం అండ
- ప్రతినెలా రూ.500 చొప్పున ఆర్థిక సాయం
- రూ.4వేల విలువ చేసే మందులు, మాత్రలు పంపిణీ
- దాతల సహకారంతో మరో రూ.700 విలువచేసే నిత్యావసర కిట్లు అందజేత
- నేడు ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం

జాగ్రత్తలు ఇలా..

- దగ్గుతున్నప్పుడు మీ నోటికి రుమాలు అడ్డుపెట్టుకోవాలి.
- బహిరంగ ప్రదేశాల్లో ఉమ్మివేయరాదు
- మాస్కులు ధరించాలి
- క్రమం తప్పకుండా చేతులు శుభ్రం చేసుకోవాలి
- ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలి
- మద్యం, పొగాకు పదార్థాలు తీసుకోవద్దు
- వెంటిలేషన్ ఉన్న గదిలో ఉండాలి

చిత్తూరు రూరల్: ఉమ్మడి జిల్లాలో 21 టీబీ యూనిట్లు ఉండగా అందులో 2022-23 లెక్కల ప్రకారం క్షయ బాధితులు 9,520 మంది ఉన్నారు. వీరిలో హెచ్ఐవీతోపాటు టీబీ ఉన్నవారు 337, టీబీతో పాటు మధుమేహం ఉన్నవారు 1,177, డీఆర్‌టీబీ 191 మంది దాకా ఉన్నారు. అయితే ప్రస్తుతం వీరిలో 4,251 మంది క్షయకు చికిత్స తీసుకుంటున్నారు. కోవిడ్ వ్యాప్తితో టీబీ కేసుల సంఖ్య తగ్గుతూ వస్తోంది. బాధితులను గుర్తించడం మొదలు నయం చేసే వరకు ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహిస్తోంది. అన్ని రకాల పరీక్షలు చేసి టీబీ నిర్ధారణతో మెరుగైన చికిత్స అందిస్తోంది. ప్రతినెలా బాధితుడికి నెలకు రూ.500 చొప్పున బ్యాంకు ఖాతాలో జమచేస్తోంది. నెలనెలా రూ.4 వేల విలువ చేసే మాత్రలు, మందులను ఉచితంగా అందిస్తోంది. టీబీ ముక్తాభారత్ అభియాన్ నిక్షయ పోషణ కార్యక్రమం ద్వారా టీబీ కట్టడికి ప్రజలను భాగస్వామ్యం చేసింది. బాధితులను దత్తత తీసుకుని రూ.750 విలువ చేసే నిత్యావసర సరుకులు, పౌష్టికాహారం అందేలా చర్యలు చేపడుతోంది. దీంతో అపోలో నిర్వాహకులు 600 మందిని దత్తత తీసుకోగా.. రెవెన్యూ, వైద్య, ఆరోగ్యశాఖలో పనిచేసే డాక్టర్లు, ఇతర శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థలు రూ.56 లక్షల వరకు విరాళాలు అందజేశారు. ఈ సాయంతో అధికారులు కంది పప్పు, నూనె, గోధుమ పిండి, పెసరపప్పు, పప్పు ఉండలు, రాగి పౌడర్, ఖర్జూరం, పాలపౌడర్ వంటి సరుకులను కిట్ రూపంలో ప్రతినెలా పంపిణీ చేస్తున్నారు.

టీబీ వ్యాధి లక్షణాలు

మైక్రోబ్యాక్టీరియం ట్యూబర్‌క్యూలోసిస్ అనే బ్యాక్టీరియా గాలి ద్వారా వ్యాపిస్తుంది. టీబీ పేషెంట్స్ తుమ్మినప్పుడు, దగ్గినప్పుడు వచ్చే తుంపర్ల ద్వారా ఇది ఇతరులకు సోకుతుంది.

- విపరీతమైన దగ్గుతోపాటు జ్వరం, ఛాతిలో నొప్పి, తలనొప్పి, నీరసం, అలసట, ఆకలి, బరువు తగ్గడం, ప్రధానంగా సాయంత్రం అవ్వగానే చలేయడం, రాత్రి వేళలో చెమటలు పట్టడం, ఛాతిలో నీరు చేరడం వల్ల దమ్ము కూడా రావడం.
- టీబీ సోకిన వెంటనే వ్యాధి లక్షణాలు బయట పడకపోవచ్చు. రోగనిరోధక శక్తి బాగా తగ్గిన వారిలో బ్యాక్టీరియా సోకిన కొద్ది రోజుల్లోనే లక్షణాలు బయటికి కనిపించవచ్చు.
- మరికొందరిలో ఏళ్ల తరబడి బ్యాక్టీరియా ఉండిపోయి, ఎలాంటి లక్షణాలు బయటికి కనిపించకపోవచ్చు. కానీ, వ్యాధి సోకిన రెండు నుంచి ఐదేళ్లలోపు వ్యాధి లక్షణాలు తీవ్రమవుతాయి.
- హెచ్ఐవీ, కిడ్నీ బాధితులు, డయాబెటిస్ మెల్లిటస్, పోషకాహార లోపం ఉన్న, ఆటో ఇమ్యూన్ వ్యాధులున్న రోగులు, క్యాన్సర్ కీమోథెరపీలో ఉన్న రోగులకు టీబీ ఎక్కువగా సోకుతుంది.



బాధితులకు కిట్లు పంపిణీ చేస్తున్న అధికారులు (ఫైల్)

నిర్ధారణ ఇలా..



రోగ నిర్ధారణ కోసం తెమడ పరీక్ష, ఛాతి ఎక్స్-రే, ల్యాటెంట్ టీబీ విషయంలో కొన్నిసార్లు చర్మం పరీక్ష, దేహంలో టీబీ సూక్ష్మక్రిమిని నిర్ధారణ చేసే న్యూరలాజికల్ పరీక్షలు, సూక్ష్మజీవుల పెరుగుదలను తెలిపే కల్చరల్ పరీక్షలతో పాటు కచ్చితమైన నిర్ధారణ కోసం బ్రోంకోస్కోపీ, థొరాకోస్కోపీ, సిటీ గైడెడ్ బయాప్సీ అనే పరీక్షలు చేస్తారని వైద్యులు అంటున్నారు.

క్షయ కట్టడే లక్ష్యం



2025లోపు క్షయ వ్యాధి అంతం కోసం ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఆ దిశగా అధికారులు, సిబ్బంది సమష్టిగా పనిచేస్తున్నారు. గతంలో కంటే ఇప్పుడు క్షయ కేసులు తగ్గుతున్నాయి. కోవిడ్ వ్యాప్తి తర్వాత నిబంధనలు పాటించడం వల్ల కేసులు తగ్గడానికి కారణమవుతోంది. లక్షణాలుంటే వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పరీక్షలు చేయించుకోవాలి. తొలిదశలోనే గుర్తించి చికిత్స తీసుకుంటే నివారణ సులభతరం అవుతుంది.

-రవిరాజు, జిల్లా క్షయ నివారణ అధికారి

ఉమ్మడి జిల్లాలో 2022-23లో టీబీ యూనిట్ల వారీగా కేసులు

బంగారుపాళ్యం 316	చిత్తూరు డీటీసీ 870
కుప్పం 417	నగరి 517
పలమనేరు 387	పి. కొత్తకోట 319
పుంగనూరు 405	సదుం 310
వి.కోట 334	చంద్రగిరి 104
గూడూరు 615	కోట 289
నాయుడుపేట 104	పుత్తూరు 211
రేణిగుంట 226	సత్యవేడు 125
శ్రీకాళహస్తి 326	సూళ్లూరుపేట 81
తిరుపతి రూరల్ 296	తిరుపతి అర్బన్ 3009
వెంకటగిరి 259	మొత్తం 9520

వైషమ్యాలకు దారితీసింది!

- రాచగున్నేరి-చిందేపల్లె రోడ్డును ఆర్‌అండ్‌బీ రోడ్డుగా మార్చుతూ గతంలో జీఓ
- ఈ మార్గంలో గోడకట్టిన శ్రీకాళహస్తి పైప్స్
- ఉపయోగపడని ప్రత్యామ్నాయ రోడ్డు
- పాత రోడ్డే కావాలంటూ గ్రామస్తుల ఆందోళన
- ప్రాణత్యాగానికైనా సిద్ధమంటున్న స్థానికులు

సాక్షి, తిరుపతి: పచ్చని పల్లెను ఫ్యాక్టరీ దత్తత తీసుకుంది. గ్రామాభివృద్ధికి చేదోడువాదోడుగా నిలిచింది. మౌలిక వసతులకు పెద్దపీట వేసింది. దశాబ్దాలుగా అన్యోన్యంగా సాగిన ఈ బంధం తాజాగా 'రహదారి' చిచ్చు వైషమ్యాలకు దారితీసింది.

అసలేం జరిగిందంటే

ఏర్పేడు మండలం, చిందేపల్లివాసులు ఏర్పేడుకు వెళ్లేందుకు వెంకటగిరి మార్గం, శ్రీకాళహస్తికి వెళ్లేందుకు శ్రీకాళహస్తి పైప్స్ కర్మాగారం మార్గంలో రాకపోకలను సాగిస్తున్నారు. కొన్ని దశాబ్దాలుగా ఈ మార్గంగుండా రాకపోకలను సాగిస్తున్నారు. సుమారు 6 కిలోమీటర్లు దూరం ఉన్న ఈ మార్గం గ్రామీణ రోడ్డు కావడంతో పంచాయతీ ఆధీనంలో ఉండేది. అయితే 1992లో ఇక్కడ ఈ మార్గానికి ఆనుకుని రోడ్డుకు ఇరువైపులా ల్యాంకో కర్మాగారం ఏర్పాటైంది. గ్రామాన్ని కూడా దత్తత తీసుకుని కొంతమేరకు అభివృద్ధి పనుల్లో భాగస్వామ్యం అయింది. కాలుష్యం, రసాయన వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ వదిలేయడంతో భూగర్భజలాలు కలుషితమయ్యాయి. తాగునీటి సమస్య ఏర్పడింది.

ఆ జీవో రాజేసింది

జీఓ నం.22 ద్వారా 2016లో రాష్ట్ర వ్యాప్తంగా 61 గ్రామీణ రోడ్లను ఆర్‌అండ్‌బీ పరిధిలోకి మార్చుతూ ఉత్తర్వులు విడుదలయ్యాయి. ఈనేపథ్యంలోనే రాచగున్నేరి-చిందేపల్లి రోడ్డు కూడా ఆర్‌అండ్‌బీ రోడ్డు పరిధిలోకి వచ్చింది. ఫ్యాక్టరీ మధ్యలో ఉన్న ఈ రోడ్డుపై పంచాయతీ ఆజమాయిషీ కోల్పోయింది. ఇదే అదునుగా ఫ్యాక్టరీ యాజమాన్యం సదరు రోడ్డును కలుపుకోవాలని నిశ్చయించింది. ఫ్యాక్టరీ ప్రాంగణంలోని రహదారి వల్ల అటువైపుగా వెళ్లే తమ వాహనాలకు ఇబ్బంది ఏర్పడుతుందని, ఈ రోడ్డును తమ ఆధీనంలోకి ఇవ్వాలని దరఖాస్తులు పెట్టింది. ఈ నేపథ్యంలో ఫ్యాక్టరీ పైభాగంలో ప్రత్యామ్నాయ రోడ్డు వేశారు. ఈ మార్గం తమకు అనుకూలంగా లేదని, రెండు కిలోమీటర్లు చుట్టు పెరుగుతోందని, ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని గ్రామస్తులు వ్యతిరేకిస్తూ వస్తున్నారు. ఈ వివాదం నడుస్తున్న తరుణంలోనే ఈనెల 18వ తేదీన అర్ధరాత్రి ఫ్యాక్టరీ యాజమాన్యం పోలీసు బలగాల సాయంతో రోడ్డుకు అడ్డంగా గోడ కట్టింది. అడ్డుకున్న స్థానికులపై కేసులు బనాయించారు.

బీజేపీ మద్దతుతో ఆందోళన

పాతరోడ్డునే పునరుద్ధరించాలని డిమాండ్‌చేస్తూ గురువారం శ్రీకాళహస్తి పైప్స్ ఫ్యాక్టరీ ఎదుట బీజేపీ నేతలు స్థానికులతో కలిసి ఆందోళన చేశారు. 2016లో టీడీపీ ప్రభుత్వం ప్రత్యేక జీఓ నం.22 ద్వారా ఈ రోడ్డును ఆర్‌అండ్‌బీ రోడ్డుగా మార్చడమే స్థానికులకు శాపంగా మారిందని జీఓ కాపీలను బహిర్గతం చేశారు.



కర్మాగారం వద్ద ఆందోళన చేస్తున్న స్థానికులు



రోడ్డుకు అడ్డుగా నిర్మించిన గోడ

పాత రోడ్డే అనుకూలం

మా గ్రామానికి పాత రోడ్డు 80 ఏళ్లుగా ఉంది. కంపెనీ యాజమాన్యం దురుద్దేశంతో రోడ్డును ఆక్రమించుకుని ప్రత్యామ్నాయ మార్గం కల్పిస్తామని చెప్పడం దుర్మార్గం. గ్రామీణ రోడ్డుగా ఉన్నప్పుడు మా రోడ్డు జోలికి రాని ఫ్యాక్టరీ వాళ్లు ఆర్‌అండ్‌బీ రోడ్డుగా మార్చాక ఇంతటి దారుణానికి ఒడిగట్టారు. గత ప్రభుత్వంలో ఇచ్చిన జీఓ మాకు రహదారి సమస్యను తెచ్చిపెట్టింది. ప్రాణత్యాగాలకైనా సిద్ధమే కానీ పాత రోడ్డును వదులుకోం.

- వెంకటసుబ్బయ్య, గ్రామస్తుడు, చిందేపల్లి, ఏర్పేడు మండలం

ప్రత్యామ్నాయ రోడ్డు ఏర్పాటు

గ్రామస్తులు, పరిశ్రమ యాజమాన్యంతో మాట్లాడి వివాదాన్ని పరిష్కరించేందుకు ఇద్దరు తహసీల్దార్లను నియమించాం. వారు గ్రామస్తులతో మాట్లాడుతున్నారు. ప్రస్తుతానికి ప్రత్యామ్నాయ రోడ్డు ఏర్పాటుచేశాం.

- రామారావు, ఆర్డీఓ, శ్రీకాళహస్తి రెవెన్యూ డివిజన్

అంగన్‌వాడీల్లో ఖాళీలు భర్తీ చేయండి



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్: అంగన్‌వాడీల్లో పదోన్నతలు, ఖాళీల్లో జాప్యం చోటు చేసుకుందని, వెంటనే ఈ ప్రక్రియ పూర్తి చేయాలని కలెక్టర్ కే.వెంకరమణారెడ్డి మహిళా శిశుసంక్షేమశాఖ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం పిల్లలు, గర్భిణులు ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టిసారించిందని, ఆ మేరకు అధికారులు శ్రద్ధ చూపాలని చెప్పారు. 0-5 సంవత్సరాల చిన్న పిల్లల ఆధార్ నమోదు జిల్లాలో 58 శాతం పూర్తయిందన్నారు. సచివాలయ సిబ్బంది వీరి ఆధార్ నమోదుకు ప్రత్యేక శ్రద్ధ చూపాలని చెప్పారు. పాఠశాలల పనితీరుపై తరచూ పర్యావేక్షణ ఉండాలని ఆదేశించారు. స్పందనలో వచ్చే అర్జీలు సకాలంలో పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

కల్పవృక్ష వాహనంపై కోదండరాముడి కటాక్షం

తిరుపతి కల్చరల్: కోదండరామస్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాల్గవ రోజు గురువారం ఉదయం కల్పవృక్ష వాహనాన్ని అధిరోహించి శ్రీసీతాలక్ష్మణ సమేత శ్రీకోదండరామస్వామి విహరిస్తూ భక్తులను కటాక్షించారు. వాహనసేవ అనంతరం ఆలయంలోని కల్యాణ మండపంలో ఉత్సవర్లకు వేడుకగా స్నపన తిరుమంజనం చేపట్టారు. రాత్రి సర్వభూపాల వాహన సేవ వేడుకగా నిర్వహించారు. వాహన సేవ అనంతరం ఆలయ ఆవరణలోని కల్యాణ మండపంలో ఉత్సవర్లకు శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం చేపట్టారు. సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా అలరించాయి. గజరాజులు ముందు తీవీగా నడుస్తుండగా వాహన సేవలు సాగాయి. తిరుమల పెద్ద జీయర్ స్వామి, చిన్న జీయర్ స్వామి, ఆలయ డెప్యూటీ ఈవో నాగరత్న, వీజీఓ మనోహర్, ఏఈఓ మోహన్, సూపరింటిండెంట్ రమేష్, కంకణభట్టర్ ఆనందకుమార్ దీక్షితులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు చలపతి, సురేష్ పాల్గొన్నారు.



సర్వభూపాల వాహనంపై దర్శనమిస్తున్న కోదండరామస్వామి

కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి జిల్లా పరిధిలోని 5 కస్తూరిభా గాంధీ బాలికా విద్యాలయాల్లో 2023-24లో 6వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ డాక్టర్ వీ.శేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతితో పాటు 7 నుంచి 10వ తరగతి వరకు మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఆసక్తి ఉన్న బాలికలు ఈ నెల 27 నుంచి ఏప్రిల్ 20వ తేదీలోపు ఏపీకేజీబీవీ.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మరింత సమాచారానికి సమగ్ర శిక్ష అసిస్టెంట్ జీసీడీఓను 94418 63994నంబర్లో సంప్రదించాలని డీఈఓ సూచించారు.

ఎన్ఎంఎంఎస్‌కు 172 మంది ఎంపిక

తిరుపతి ఎడ్యుకేషన్ : నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్ఎంఎంఎస్) పరీక్షకు తిరుపతి జిల్లా పరిధిలో 172 మంది విద్యార్థులు ఎంపికైనట్లు డీఈఓ డాక్టర్ వి.శేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా విద్యార్థులకు సంబంధించిన ఒరిజినల్ కుల, ఆదాయ, ఫిజికల్ హ్యాండీక్యాప్డ్, ఏడో తరగతి పరీక్షకు సంబంధించిన మార్కుల జాబితాను శుక్రవారం తిరుపతి డీఈఓ కార్యాలయంలోని ఎగ్జామినేషన్ సెక్షన్‌లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3గంటల లోపు సమర్పించాలని సూచించారు.

కార్పొరేషన్ ఉద్యోగిపై హత్యాయత్నం

తిరుపతి క్రైమ్: తిరుపతి కార్పొరేషన్ ఉద్యోగిపై గురువారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తులు హత్యాయత్నం చేశారు. తెలిసిన సమాచారం మేరకు.. నగరంలోని రాయల్ నగర్‌లో నివాసముంటున్న మునిరాజా(45) తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌లోని రెవెన్యూ విభాగంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. గురువారం మునిరాజా తన ఇంటి వద్ద నుంచి ద్విచక్ర వాహనంపై విధులకు హాజరయ్యేందుకు బయలుదేరాడు. ఇంతలో ముగ్గురు వ్యక్తులు నెంబర్ ప్లేట్ లేని ద్విచక్ర వాహనంపై వెనుకనుంచి వచ్చి అతని వాహనాన్ని ఢీకొన్నారు. అతని కింద పడిపోగానే ఆ ముగ్గురు కత్తులతో కుడి కాలు, మెడ, చెంపపై కత్తితో దాడిచేశారు. గాయాలు కావడంతో మునిరాజా వారి నుంచి తప్పించుకునే ప్రయత్నం చేశాడు. ఇంతలో చుట్టుపక్కల వారు ఆ స్థలంలోకి రావడంతో ఆ వ్యక్తులు భయపడి ద్విచక్ర వాహనంపై పారిపోయారు. గాయాలు పాలైన మునిరాజాను నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. దీనిపై బాధితుడిని ప్రశ్నించగా ముగ్గురు వ్యక్తుల్లో ఒకరు హెల్మెట్ ధరించి ఉన్నాడని తెలిపాడు. అయితే వాళ్లు ఎందుకు దాడిచేశారో తనకు తెలియదని బాధితుడు చెబుతున్నాడు. అయితే పోలీసులకు దీనిపై ఎలాంటి సమాచారం అందలేదు.

చెక్‌బౌన్స్ కేసులో ఏడాది జైలు

– రూ.9 లక్షల జరిమానా

సూళ్లూరుపేట: పట్టణానికి చెందిన వేనాటి లీలాకృష్ణారెడ్డి అనే వ్యక్తికి చెక్‌బౌన్స్ కేసులో ఏడాది జైలుశిక్షతో పాటు రూ.9 లక్షల జరిమానా విధిస్తూ అడిషనల్ జ్యూడిషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్‌క్లాస్ జడ్జి ఎస్.అనూష గురువారం తీర్పు చెప్పారు. పట్టణానికి చెందిన పాండియన్ వెంకటేష్ అనే వ్యక్తికి లీలాకృష్ణారెడ్డి అప్పు ఉండడంతో బ్యాంక్ చెక్ ఇచ్చారు. ఆ చెక్ బ్యాంక్‌లో వేయగా బౌన్స్ అయ్యింది. దీనిపై 2019లో కేసు పెట్టారు. ఆ కేసు విచారణకు వచ్చింది. ముద్దాయి లీలాకృష్ణారెడ్డికి సంవత్సరం కాలం జైలు శిక్షతో పాటు రూ.9 లక్షలు జరిమానా విధిస్తూ గురువారం సంచలన తీర్పు చెప్పారు.

పశు సంపదను కాపాడుకుందాం

- ఎండ తీవ్రతపై అప్రమత్తత అవసరం
- పశువులకు వడదెబ్బ తగిలే అవకాశం
- నిర్లక్ష్యం చేస్తే మృత్యువాత



షెడ్డులో పాడి ఆవులు



మేతకు వెళుతున్న పశువులు

చిత్తూరు అగ్రికల్చర్: వేసవిలో ఎండల తీవ్రత నుంచి పశు సంపదను కాపాడుకోవలసిన అవసరం ఉంది. మండు టెండలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎండ తాపంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటికి వచ్చే పరిస్థితి ఉండదు. చిత్తూరు డివిజన్ పరిధిలో 1,036 గేదెలు ఉండగా, 4.16 లక్షల మేరకు ఆవులు ఉన్నాయి. వీటిద్వారా ఉత్పత్తి అయ్యే పాలను విక్రయించుకుని రైతులు జీవనం సాగిస్తున్నారు. ఎండ తీవ్రత వలన పశువులకు వడదెబ్బ తగిలే అవకాశం ఉంది. తద్వారా పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గడమే కాకుండా, పశువులు మృత్యువాత పడే ప్రమాదం ఉంది. రైతులు పశువులను ఎండ తీవ్రత నుంచి కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. ఇందు కోసం రోజువారీ యాజమాన్య పద్ధతులను పాటించాల్సిన అవసరం ఉందని పశువైద్యాధికారులు తెలియజేస్తున్నారు.

యాజమాన్య పద్ధతులు ఇలా

సాధారణంగా వేసవిలో ఎండ తీవ్రత, అధిక ఉష్ణోగ్రత వల్ల పాడి పశువులు ఒత్తిడికి, అసౌకర్యానికి లోనవుతాయి. తద్వారా మేత తీసుకోవడం తగ్గిపోతుంది. దీంతో పాల దిగుబడి, పాలలో వెన్నశాతం తగ్గిపోతుంది. ఇలాంటి పరిస్థితులను అధిగమించేందుకు పశువుల సంరక్షణకు రోజువారీ యాజమాన్య పద్ధతులను పాటించాల్సి ఉంది.

- పశువుల షెడ్డులో గాలి ప్రసరణ బాగా ఉండేలా చూసుకోవాలి.
- షీట్లు వేసిన షెడ్డుపై 8–10 సెం.మీ.మందంతో ఎండు గడ్డిని పరిచి రోజుకు రెండు, మూడు సార్లు నీటితో తడపాలి. షెడ్డుకు ఇరువైపులా గోనె సంచులను కట్టి నీటితో తడపడం ద్వారా షెడ్డు లోపల ఉష్ణోగ్రత తగ్గడంతోపాటు వేడి గాలుల తీవ్రతను తగ్గించవచ్చు. వీలైతే నీటి స్ప్రింక్లర్లు, ఫ్యాన్లు ఏర్పాటు చేసుకోవచ్చు.
- షెడ్డు చుట్టూ సుబాబుల్, అవిసె, మునగ చెట్లు, పశుగ్రాసం పెంచడం వలన నీడతో పాటు పశుగ్రాసంగా కూడా ఉపయోగించుకోవచ్చు.
- ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న సమయంలో బయటకు తీసుకెళ్లకూడదు.
- ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే మేతకు తీసుకెళ్లాలి.
- పశువులు వేసవిలో నీళ్లు ఎక్కువగా తాగడం వలన మేత తక్కువగా తీసుకుంటాయి. పోషక విలువలు ఉన్న మేతను అందించాలి. ఉదయం పచ్చి మేతను, సాయంత్రం ఎండు గడ్డిని అందించాలి. చాఫ్ కట్టర్‌ను వాడటం వల్ల మేత వృథాను తగ్గించవచ్చు.
- పచ్చిమేత సరిపడా అందుబాటులో లేనప్పుడు సైలేజ్, టీఎంఆర్, అజొల్లాను వాడవచ్చు.
- మినరల్ మిక్చర్, ఉప్పును దాణాలో కలిపి పెట్టుకోవాలి.
- పశువులకు అన్ని వేళలా స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులో ఉంచాలి.
- చూడి పశువులను ఎండలో మేతకు పంపించకూడదు.
- అధిక ఉష్ణోగ్రత వలన హార్మోన్ల సమతుల్యత దెబ్బతిని పునరుత్పత్తి మీద ప్రభావం చూపుతుంది. సకాలంలో ఎదకు రావు, మూగ ఎద ఉంటుంది. కావున రైతులు పశువులను ఉదయం, సాయంత్రం ఎద లక్షణాల కోసం పరిశీలించి కృత్రిమ గర్భధారణ చేయించాలి.

వడదెబ్బ లక్షణాలు

ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు పశువులు వడ దెబ్బకు లోనవుతాయి. పశువులకు వడదెబ్బ తగిలినపుడు ముందస్తుగా లక్షణాలను రైతులు గుర్తించేందుకు కొన్ని లక్షణాలు కనిపిస్తాయి.

- పశువు అధిక శరీర ఉష్ణోగ్రతకు గురవడం.
- అధిక శ్వాస, నాడి రేటు పెరగడం.
- గుండె వేగంగా కొట్టుకోవడం, చొంగ ఎక్కువగా కార్చుతాయి.
- చర్మంపై వెంట్రుకలు బిరుసుగా తయారవుతాయి.
- వడదెబ్బ తీవ్రత ఎక్కువగా ఉన్నపుడు స్పృహ కోల్పోయి ప్రాణనష్టం జరగవచ్చు.
- వడ దెబ్బకి గురైన పశువును వెంటనే చల్లని ప్రదేశంలోకి తీసుకువచ్చి శరీరంపై నీళ్లు చల్లి వెంటనే పశువైద్యున్ని సంప్రదించి తగిన చికిత్స అందించాలి.

నిర్లక్ష్యం వద్దు



వేసవి కాలంలో ఎండ తీవ్రతను అధిగమించేందుకు పాడి రైతులు రోజువారీ యాజమాన్య పద్ధతులను పశువుల్లో తప్పనిసరిగా పాటించాలి. నిర్లక్ష్యం చేస్తే పశువులు వడదెబ్బకు గురై పాల దిగుబడి తగ్గడమే కాకుండా, మృత్యువాత పడడం ఖాయం. కావున రైతులు పశువుల పట్ల ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలి. – ప్రభాకర్, పశుసంవర్థక శాఖ డీడీ, చిత్తూరు డివిజన్

26న ఉచిత స్కానింగ్ రద్దు

తిరుపతి తుడా: స్విమ్స్‌లో గర్భిణులకు ప్రతి ఆదివారం అల్ట్రా సౌండ్ స్కానింగ్ ఉచితంగా నిర్వహిస్తారు. 26వ తేదీ ఆదివారం కొన్ని అనివార్య కారణాల వల్ల స్కానింగ్ రద్దు చేసినట్లు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తర్వాత ఆదివారం నుంచి యథావిధిగా కొనసాగుతుందని పేర్కొన్నారు.

ద్విచక్రవాహనాల దొంగలకు రిమాండ్



నాగలాపురం పోలీస్‌స్టేషన్‌లో నిందితులతో డీఎస్పీ రామరాజు, సీఐ శివకుమార్‌రెడ్డి, పోలీసులు

పిచ్చాటూరు: ద్విచక్ర వాహనాల దొంగతనం కేసులో నిందితులుగా ఉన్న నలుగురికి సత్యవేడు కోర్టు 15 రోజులు రిమాండ్ విధించినట్లు నాగలాపురం ఎస్‌ఐ హనుమంతప్ప తెలిపారు. గురువారం ఉదయం నాగలాపురం పోలీస్ స్టేషన్‌లో పుత్తూరు డీఎస్పీ రామరాజు, సత్యవేడు సీఐ శివకుమార్ రెడ్డి సమక్షంలో నలుగురు నిందితులతో పాటు వారు దొంగిలించిన 11 ద్విచక్ర వాహనాలను మీడియా ముందు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఎ.అజయ్(28), వినోద్‌కుమార్(20), బి.విష్ణు(19), ప్రతాప్(32) నాగలాపురం తూర్పు ఆర్చి వద్ద బైక్‌పై నాగలాపురం వైపు వస్తుండగా అక్కడ ఉన్న పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేశారన్నారు. నలుగురుని ఎస్‌ఐ, సిబ్బంది చాకచక్యంగా పట్టుకుని విచారించారు. నాగలాపురం మండలంలో 5, పిచ్చాటూరు మండలంలో 4, శ్రీసిటీ, విజయపురం పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక్కొక్కటి చొప్పున మొత్తం 11 వాహనాలు దొంగిలించినట్లు అంగీకరించారని తెలిపారు. వాటి విలువ రూ.4.5 లక్షలు ఉంటుందన్నారు. నిందితుల్లో అజయ్, వినోద్‌కుమార్ విష్ణు నాగలాపురం మండలానికి చెందిన వారు కాగా, ప్రతాప్ తమిళనాడులోని పొన్నేరికి చెందిన వ్యక్తిగా గుర్తించామన్నారు. వాహనాలను స్వాధీనం చేసుకొని నిందితులను సత్యవేడు కోర్టుకు తరలించగా న్యాయమూర్తి 15 రోజులు రిమాండ్ విధించినట్లు ఆయన వెల్లడించారు. ఈ కేసును ఛేదించడానికి కృషి చేసిన ఎస్‌ఐ హనుమంతప్ప, ఏఎస్‌ఐ రవి, హెడ్ కానిస్టేబుల్ హనీఫ్, కానిస్టేబుల్ రఘు, కుప్పారావు, గోపి, కేశవ, మారయ్య, అజిత్ లకు డీఎస్పీ రామరాజు రివార్డులు బహూకరించారు.

26న బలిజ వధూవరుల వివాహ పరిచయ వేదిక


- 25వ తేదీ లోపు పేర్లను నమోదు చేసుకోవాలి



వివాహ పరిచయ వేదిక కరపత్రాలను ఆవిష్కరిస్తున్న బలిజ జేఏసీ నేతలు

తిరుపతి కల్చరల్: తిరుపతి కర్నాల వీధిలోని హోటల్ శ్రీగురులక్ష్మిలో ఈనెల 26వ తేదీ మధ్యాహ్నం 1 నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించే బలిజ వధూవరుల వివాహ పరిచయ వేదిక విజయవంతం చేయాలని బలిజ జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆళ్వారు మురళి పిలుపునిచ్చారు. ఈమేరకు గురువారం బలిజ సంఘ కార్యాలయంలో వారు వివాహ పరిచయ వేదిక కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆళ్వారు మురళి మాట్లాడుతూ పరిచయ వేదికలో పాల్గొనదలిచిన వారు ఈనెల 25వ తేదీలోపు పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు. మ్యాక్సీ సైజ్ ఫొటో, ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకుని రావాల్సి ఉంటుందని చెప్పారు. తాము ఇచ్చే దరఖాస్తుల్లో వివరాలు నమోదు చేసుకోవాలని తెలిపారు. అనంతరం ఎల్‌సీడీ ప్రాజెక్ట్ ద్వారా వివరాలు తెలియజేస్తామన్నారు. నచ్చిన వధూవరుల ఫోన్ నంబర్లు అందించి వారి వివాహానికి తమవంతు సహకారం అందజేయనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 99850 13529, 93983 14847 నంబర్లను సంప్రదించి ఈ అవకాశాన్ని ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని బలిజ కులస్తులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బలిజ జేఏసీ నేతలు రవీంద్ర, చెంచుకృష్ణ, సుబ్రమణ్యం, చిట్టిబాబు, శంకరప్ప, నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

గడువులోపు రీసర్వే పూర్తిచేయండి



సర్వేపై సూచనలిస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి, జేసీ, డీఆర్వో

తిరుపతి అర్బన్: గడువులోపు భూముల రీసర్వే పూర్తి చేయాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి ఆదేశించారు. గురువారం విజయవాడ నుంచి రీసర్వే వేగవంతం చేయాలని రాష్ట్ర స్థాయి అధికారులు కలెక్టర్లకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తెలియజేశారు. అనంతరం కలెక్టర్ వెంకటరమణారెడ్డి, జాయింట్ కలెక్టర్ డీకే బాలాజీ, డీఆర్వో శ్రీనివాసరావు, సర్వే ఏడీ జయరాజ్‌తో కలసి జిల్లా అధికారులతో సర్వేపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రౌండ్ ట్రూతింగ్ పనులు వేగవంతం చేయాలని చెప్పారు. సర్వే పూర్తయిన చోట సరిహద్దురాళ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. డ్రోన్ ఏరియల్ ఫ్లయింగ్ సకాలంలో పూర్తిచేయాలని తెలిపారు. బౌండరీ కన్ఫర్మేషన్, ఏరియా వ్యాలిడేషన్, సర్వే పూర్తి, ఫైనల్ రెవెన్యూ రికార్డు నిర్దేశించిన సమయంలో పూర్తి కావాలని కోరారు. జిల్లాలో 1,050 గ్రామాల్లో గాను 250 గ్రామాల్లో డ్రోన్ల ద్వారా రీసర్వే ప్రక్రియ పూర్తి కాగా మిగిలిన గ్రామాల్లోనూ సకాలంలో పూర్తిచేసేలా చర్యలు చేపట్టాలని తెలిపారు.

25, 26 తేదీల్లో అంతర జిల్లా షటిల్ పోటీలు



సమావేశంలో మాట్లాడుతున్న స్టేడియం నిర్వహకులు హర్షవర్ధన్‌రెడ్డి

గూడూరు: గూడూరు పట్టణ సమీపంలోని హెచ్‌డీ ఎరీనా ఇండోర్ స్టేడియంలో ఈనెల 25, 26 తేదీల్లో అంతర జిల్లాల షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వహకులు హర్షవర్ధన్‌రెడ్డి తెలిపారు. గురువారం ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ హెచ్‌డీ ఎరీనా ఇండోర్ స్టేడియం వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నాన్ మెడలిస్ట్, 45 ప్లస్ రెండు విభాగాల్లో పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన జట్లకు షీల్డుతో పాటు నగదు బహుమతి ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. నెల్లూరు, తిరుపతి జిల్లాల క్రీడాకారులు పాల్గొని ఈ పోటీలను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో వైజీఎస్‌బీఏ అధ్యక్షుడు జమాలుల్లా, కోదండపాణి, నాగేంద్రరెడ్డి, రవి, సురేష్, మల్లికార్జున్ రావు, తదితరులు పాల్గొన్నారు.



తిరుపతి బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.61,040
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,452

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.71,100
రిటైల్ వెండి గ్రాము	రూ.73.10

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	36	26
చిత్తూరు	36	24
తిరుమల	31	21
గూడూరు	36	27
నగరి	36	26

శ్రీవారి సేవలో క్రికెటర్ దీపక్ చాహర్



క్రికెటర్ దీపక్ చాహర్

తిరుమల : భారత క్రికెటర్ దీపక్ చాహర్ గురువారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ జనరల్ బ్రేక్ దర్శన సమయంలో ఆయన కుటుంబ సభ్యులతో కలసి శ్రీవారి మూలమూర్తిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలను స్వీకరించారు.

నేడు ఎలక్ట్రో స్టీల్ కాస్టింగ్ ఫ్యాక్టరీకి భూమిపూజ

పుంగనూరు: మండలంలోని ఆరడిగుంటలో నిర్మిస్తున్న ఫెరాఅలయ్ ఎలక్ట్రోస్టీల్ కాస్టింగ్ ఫ్యాక్టరీ నిర్మాణానికి శుక్రవారం ఉదయం రాష్ట్ర మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి భూమిపూజ చేయనున్నారు. ఫ్యాక్టరీ నిర్మాణ స్థలంలో ఏర్పాట్లను గురువారం ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, మంత్రి పెద్దిరెడ్డి పీఏ చంద్రహాస్ పరిశీలించారు. వీరితో పాటు నూతన ఏఎంసీ చైర్మన్ అమరనాథరెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ నాగరాజారెడ్డి సర్పంచ్ శంకరప్ప, ఎంపీటీసీ నంజుండప్ప, వైఎస్సార్‌సీపీ నాయకులు వంటల రెడ్డెప్ప, రమణ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో గురువారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 2 కంపార్టుమెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 53,146 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 18,655 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3 కోట్లు భక్తులు సమర్పించారు. టైం స్లాట్ టికెట్లు కలిగిన వారికి సకాలంలోనే దర్శనం లభిస్తోంది. టికెట్లు లేని వారికి దర్శనానికి 24 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లు కలిగిన వారు 3 గంటల్లో స్వామిని దర్శించుకోగలుగుతున్నారు.

మళ్లీ చిరుత కలకలం

పాకాల : మండలంలోని లింగనపల్లి పంచాయతీ సమీపంలో చిరుత సంచారంతో స్థానిక ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. స్థానిక ప్రజలు తెలిపిన వివరాల మేరకు గురువారం ఉదయం 7.30 గంటల ప్రాంతంలో పెనుమూరు మార్గం నుంచి కనం ముందర పల్లికి సమీపంలో విద్యార్థులు, ప్రయాణికులతో ఆటో వెళుతుండగా ఆటోకి 5 అడుగుల దూరంలో పడమర నుంచి తూర్పు వైపు ఓ చిరుత పులి వెళ్లింది. వెంటనే స్థానికులు అటవీశాఖ సిబ్బందికి సమాచారం అందించారు. వారు ఆ ప్రాంతానికి చేరుకుని గ్రామస్తుల సహకారంతో చుట్టు ప్రదేశాలను పరిశీలించారు. తిరిగి 12 గంటల ప్రాంతంలో చిరుత పులి ఉదయం వెళ్లిన మార్గానికి కొంత దూరంలో తూర్పు నుంచి పడమర వైపు వెళ్లడాన్ని పెనుమూరు నుంచి వస్తున్న ప్రయాణికులు గమనించారు. అటవీశాఖ అధికారులు స్పందించి గ్రామస్తులకు రక్షణ కల్పించాలని కోరుతున్నారు.

జిల్లా జడ్జి పోస్టుల ఫలితాలు విడుదల

తిరుపతిలీగల్ : రాష్ట్ర హైకోర్టు ఆధ్వర్యంలో గత ఏడాది నిర్వహించిన జిల్లా జడ్జి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థుల వివరాలను రాష్ట్ర హైకోర్టు వెబ్‌సైట్‌లో గురువారం విడుదల చేసింది. 145 మంది అభ్యర్థులు సాధించిన మార్కులు, ఇతర వివరాలను హైకోర్టు పేర్కొంది.

26న అండర్-17 ఓపెన్ గర్ల్స్ చెస్ చాంపియన్ షిప్

గూడూరు: తిరుపతి జిల్లా అండర్-17 ఓపెన్ గర్ల్స్ చెస్ చాంపియన్‌షిప్-2023ను గూడూరులోని నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో రాయ్ చెస్ అకాడమీ, తిరుపతి అడహక్ చెస్ కమిటీ, ఆంధ్రా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 26వ తేదీన నిర్వహిస్తున్నట్లు టోర్నమెంట్ డైరెక్టర్ ఎస్.కె.షరీఫా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2006 తరువాత జన్మించిన బాలికలు అర్హులని, తమ ధ్రువీకరణ పత్రాలతో టోర్నీలో పాల్గొనే క్రీడాకారిణిలు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఈనెల 25వ తేదీ రాత్రి 9 గంటలలోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పేర్కొన్నారు.